సంపుటి :02 సంచిక :286 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 23, జనవరి 2026



## కొమ్మూరి x పల్లా

- ఇరు ఇరువర్గాల మధ్య ప్రొటోకాల్ రగడ

05

- జనగామలో మంత్రి సీతక్కకు చేదు అనుభవం
- అధికారిక కార్యక్రమాల్లో వ్యతిరేక నినాదాలు
- కొమ్మూరి, పల్లా వర్గీయుల మధ్య తోపులాట

# గిరి బిడ్డలే వన దేవతలు

- ఆకాశ గంగ అదృష్ట దేవత సమ్మక్క



ఆమెకు పగిడిద్దరాజుతో వివాహం

దంపతుల సంతానమే సారలమ్మ, జంపన్న

సారలమ్మకు గోవిందరాజులతో పెండ్లి

కాకతీయుల అక్రమ పన్ను విధానానికి ఎదురుతిరిగిన సమ్మక్క కుటుంబం

సర్వశక్తులొడ్డి.. పోరాడి అమరులై వన దేవతల అవతారం

02

మేడారం అడవుల నుంచి వినిపించే ఆ తల్లి గజ్జెల సవ్వడి, భక్తుల గుండెల్లో కొలువుదీరిన ఆ వీరగాథ ఒక అద్భుత దృశ్యం. తెలుగు నేల గర్వించే ఈ మహా జాతర వెనుక ఉన్న జానపద గాథ అద్భుత రసంతో సాగుతుంది. కథనం ఇలా ప్రారంభమవుతుంది.. చాలా ఏళ్ల క్రితం మేడారం దండకారణ్యంలో వేటగాళ్లకు ఒక వింత దృశ్యం కనిపించింది. క్రూర మృగాల మధ్య ఒక పసిపాప పులులతో ఆడుకుంటూ కనిపించింది. ఆ పాప చుట్టూ ఒక వింతైన కాంతి పుంజం ఆవరించి ఉంది. ఆ పాపే సమ్మక్క. ఆమెను గిరిజన దొర పులుల నుంచి కాపాడి తన ఇంటికి తెచ్చుకున్నాడు. ఆమె అడుగుపెట్టిన వేళ గిరిజన పల్లెల్లో పాడిపంటలు సమృద్ధిగా పండాయి. సమ్మక్క కేవలం ఒక మనిషిలా కాకుండా, రోగాలను నయం చేసే శక్తులున్న మాతృమూర్తిగా ఎదిగింది. ఆమె చూపులో కరుణ, చేతిలో మహిమ ఉండటంతో ప్రజలందరూ ఆమెను తమ కులదైవంగా భావించేవారు.

- అక్షరదర్బార్, మేడారం



## రౌడీషీటర్ కోతి రమేశ్ బహిష్కరణ

- ఆరునెలలు వరంగల్ కమిషనరేట్ లోకి నో ఎంట్రీ
- వరంగల్ సీపీ సన్ ప్రీత్‌సింగ్ సంచలన నిర్ణయం

02

## 7 గంటలు.. 40 ప్రశ్నలు

- సుదీర్ఘంగా సాగిన కేటీఆర్ విచారణ
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నించిన సిట్
- అర్థం లేని ప్రశ్నలు అడిగారు: కేటీఆర్
- ప్రతి ప్రశ్నకు నిర్భయంగా సమాధానమిచ్చానని వివరణ

05



## హస్తం VS గులాబీ

- మెజారిటీ వార్డుల్లో గెలుపు కోసం గండ్ర ద్వయం మధ్య పోరు
- సింగరేణి గడ్డపై విజయమే లక్ష్యంగా నేతల వ్యూహాలు
- వార్డుల్లో గెలుపు గుర్రాలను ఎంపిక చేయటంపై నజర్
- మున్సిపాల్టీ ఛైర్మన్ పీఠంపై ప్రధాన పార్టీల్లోని బీసీ నేతల గురి

05

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. మున్సిపాలిటీ ఛైర్మన్ రిజర్వేషన్ ఈసారి బీసీ జనరల్ కు మారడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. గత రెండు విడతలుగా ఎస్సీ మహిళలకు రిజర్వ్ అయిన ఈ పదవిపై ఇప్పుడు ప్రధాన పార్టీల బీసీ నేతలు కన్నేశారు.

- అక్షరదర్బార్, భూపాలపల్లి





# గిరి బిడ్డలే వన దేవతలు

- ఆకాశ గంగ అదృష్ట దేవత సమ్మక్క
- ఆమెకు పగిడిద్దరాజుతో వివాహం
- దంపతుల సంతానమే సారలమ్మ, జంపన్న
- సారలమ్మకు గోవిందరాజులతో పెండ్లి
- కాకతీయుల అక్రమ పన్ను విధానానికి ఎదురుతిరిగిన సమ్మక్క కుటుంబం
- సర్వశక్తులొడ్డి.. పోరాడి అమరులై వన దేవతల అవతారం

అక్షరదర్బార్, మేడారం : మేడారం అడవుల నుంచి వినిపించే ఆ తల్లి గజ్జెల సవ్వడి, భక్తుల గుండెల్లో కొలువుదీరిన ఆ వీరగాథ ఒక అద్భుత దృశ్యం. తెలుగు నేల గర్వించే ఈ మహా జాతర వెనుక ఉన్న జానపద గాథ అద్భుత రసంతో సాగుతుంది. కథనం ఇలా ప్రారంభమవుతుంది.. చాలా ఏళ్ల క్రితం మేడారం దండకారణ్యంలో వేట గాళ్లకు ఒక వింత దృశ్యం కనిపించింది. క్రూర మృగాల మధ్య ఒక పసిపాప పులులతో ఆడుకుంటూ కనిపించింది. ఆ పాప చుట్టూ ఒక వింతైన కాంతి పుంజం ఆవరించి ఉంది. ఆ పాపే సమ్మక్క. ఆమెను గిరిజన దొర పులుల నుంచి కాపాడి తన ఇంటికి తెచ్చుకున్నాడు. ఆమె అడుగు పెట్టిన వేళ గిరిజన పల్లెల్లో పాడిపంటలు సమృద్ధిగా పండాయి. సమ్మక్క కేవలం ఒక మనిషిలా కాకుండా, రోగాలను నయం చేసే శక్తులున్న మాతృమూర్తిగా ఎదిగింది. ఆమె చూపులో కరుణ, చేతిలో మహిమ ఉండటంతో ప్రజలందరూ ఆమెను తమ కులదైవంగా భావించే వారు.

## - వీర వనితల యుద్ధ గర్జన

సమ్మక్కను పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశారు. పగిడిద్దరాజు కాకతీయుల కింద సామంత రాజుగా ఉండేవాడు. వీరికి సారలమ్మ (సారక్క), నాగులమ్మ, జంపన్న అనే సంతానం కలిగారు. సమ్మక్క, సారక్కలు తల్లికూతుళ్లు. ఒకసారి తీవ్రమైన కరువు రావడంతో ప్రజలు పన్నులు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు పన్నుల కోసం ఒత్తిడి చేయగా, ప్రజల కష్టాలను చూసి పగిడిద్దరాజు ఎదిరించాడు. ఇది మహా సంగ్రామానికి దారితీసింది. ఆ యుద్ధంలో పగిడిద్దరాజు, సారల మ్మ, గోవిందరాజులు వీరోచితంగా పోరాడి నేలకొరిగారు. తన కుటుంబం అంతా కళ్లముందే బలైపోతున్నా సమ్మక్క వెన్ను చూపలేదు. అపరకాళిలా మారి యుద్ధం చేసింది.

## - రక్తపుటేరు... జంపన్న వాగు

యుద్ధంలో దెబ్బతిన్న సమ్మక్క కుమారుడు జంపన్న అవమానాన్ని భరించలేక, శత్రువుల చేతిలో చావడం ఇష్టం లేక పక్కనే ఉన్న సంపంగి వాగులోకి దూకి ప్రాణత్యాగం చేశాడు. అతని రక్తంతో ఆ వాగు ఎర్రగా మారిపోయింది. అప్పటి నుంచి ఆ వాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. ఈ నాటికీ భక్తులు ఆ వాగులో స్నానం చేస్తే తమ పాపాలు తొలగిపోతాయని, జంపన్న ఆశీస్సులు ఉంటాయని నమ్ముతారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన సమ్మక్క చివరకు చిలుకల గుట్ట వైపు వెళ్లి అదృశ్యమైపోయింది. ఆమె కోసం వెతికిన భక్తులకు అక్కడ ఒక కుంకుమ భరిణ, పులి అడుగుజాడలు మాత్రమే కనిపించాయి.

## - మహిమాన్విత వనదేవతలు

సమ్మక్క తన ప్రాణాలను వదిలిన చోట వెలసిన ఆ కుంకుమ భరిణే నేడు మనకు కనిపిస్తున్న దేవతా స్వరూపం. గిరిజన ఆచారం ప్రకారం ఇక్కడ విగ్రహాలు ఉండవు. కేవలం గద్దెలపై అమ్మవార్లను ప్రతిష్ఠిస్తారు. రెండేళ్లకోసారి జరిగే జాతరలో చిలుకల గుట్ట నుంచి కుంకుమ భరిణ రూపంలో సమ్మక్కను తెచ్చి గద్దెపై ప్రతిష్ఠించినప్పుడు ఆ ప్రాంతమంతా పూనకాలతో ఊగిపోతుంది. తల్లీ కూతుళ్లు ఇద్దరూ వనదేవతలుగా మారి కోట్లాది మంది భక్తుల కోర్కెలు తీరుస్తున్నారు. భక్తులు తమ బరువుకు సమానంగా బెల్లాన్ని (బంగారం) సమర్పించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆ అడవి తల్లి కరుణా కటాక్షాలు తమపై ఎల్లప్పుడూ ఉంటాయని విశ్వసిస్తారు.

## కుంకుమ భరిణ ప్రాశస్త్యం

చిలుకల గుట్ట పరిసరాల్లో సమ్మక్క అదృశ్యమైన వేళ భక్తులకు లభించిన ఆ కుంకుమ భరిణ సామాన్యమైన వస్తువు కాదు. అది ఆ తల్లి ఆత్మశక్తికి, మాతత్వానికి నిలువెత్తు సాక్ష్యం. గిరిజన సంప్రదాయంలో విగ్రహారాధన కంటే ప్రకృతి ఆరాధనకే ప్రాముఖ్యం ఎక్కువ. అందుకే మేడారం గద్దెలపై సమ్మక్కను కుంకుమ భరిణ రూపంలోనే ఆవాహన చేస్తారు. అడవిలో దొరికిన ఆ పవిత్ర భరిణలో దేవత నిగూఢంగా కొలువై ఉంటుందని, దానిని తాకిన గాలి సైతం పవిత్రమై అన్నిరకాల రోగాలను హరిస్తుందని గిరిజనుల నమ్మకం. గిరిజన పూజారులు అత్యంత రహస్యంగా ఈ భరిణను గద్దెపైకి తెచ్చే ఘట్టం అద్వితీయం. ఆ క్షణాన అడవి మొత్తం పులకించిపోతుంది. భక్తులు సమర్పించే బంగారం (బెల్లం) ఆ తల్లి పాదాల చెంత ఉన్న ఈ భరిణకే చెందుతుంది. రూపం లేని ఆ పరాశక్తిని ఒక చిన్న భరిణలో చూసుకుంటూ లక్షలాది మంది భక్తులు తమ బాధలను మరచిపోయి తన్మయత్వంతో ఊగిపోతారు.




'అక్షరదర్బార్' క్యాలెండర్ ను శుక్రవారం రామగుండం ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 'అక్షరదర్బార్' రిపోర్టర్ రాళ్లబండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

— అక్షరదర్బార్, మొగుళ్లపల్లి

# రౌడీషీటర్ కోతి రమేశ్ నగర బహిష్కరణ

- ఆరునెలలు వరంగల్ కమిషనరేట్ లోకి నో ఎంట్రీ
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సంచలన నిర్ణయం

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా ముందుకెళ్తున్నది. రౌడీషీటర్ల ఆగడాలపై పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉక్కుపాదం మోపుతున్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సమాజంలో అశాంతి సృష్టించాలని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ వరుస కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్‌ను కమిషనరేట్ పొలిమేరల నుంచి ఆరు నెలల పాటు బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. సదరు నిందితుడిని పోలీస్ అధికారులు స్వయంగా జిల్లా సరిహద్దుల వరకు తీసుకెళ్లి విడిచిపెట్టడం నేరగాళ్లకు గట్టి హెచ్చరికగా మారింది. గత కొన్నేళ్లుగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీసులు అత్యంత కఠినమైన పద్ధతులను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా భూ దందాలు, సెటిల్‌మెంట్లు, దౌర్జన్యాలకు పాల్పడే పాతనేరస్థులపై నిఘా పెంచడమే కాకుండా.. వరుసగా నేరాలకు పాల్పడే వారిని ఏరివేసేందుకు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. నేర స్వభావాన్ని బట్టి కొందరిని ఏకంగా నగరం నుంచి బహిష్కరించే "ఎక్స్‌టర్న్‌మెంట్" వేటు వేస్తూ శాంతిని కాపాడుతున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం కన్నేసి ఉంచుతున్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారిని వెంటనే అదుపులోకి తీసుకోవడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.



# గుండెపోటుతో వ్యక్తి మృతి

అక్షర దర్బార్,పరకాల: దామెర పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. దామెర గ్రామానికి చెందిన భాషబోయిన రాజాలు (58) పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వాటర్ ట్యాంకు వద్ద కూర్చుని మాట్లాడుతుండగా అకస్మాత్తుగా కింద పడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై కొంక అశోక్ కు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అశోక్ వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరీక్షించగా అప్పటికే రాజాలు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

# బీఆర్ఎస్ హయాంలోనే భూపాలపల్లి అభివృద్ధి

- రమణన్న బస్తీ బాటలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి




అక్షర దర్బార్, భూపాలపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భూపాలపల్లి పట్టణ, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో శుక్రవారం నిర్వహించిన రమణన్న బస్తీ బాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ.. ఓటు విలువను ప్రజలు గుర్తించి ఆలోచనతో నిర్ణయం తీసుకోవాలని అన్నారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లి, మున్సిపాలిటీగా మారి జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. తమ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన గోదావరి నీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. అలాగే భూపాలపల్లికి మెడికల్ కాలేజీ, 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కొత్త సమస్యలు సృష్టిస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.




# ట్రంప్ విధానాలకు మోడీ వత్తాసు హానికరం

- ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

అక్షర దర్బార్, దుగ్గొండి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవలంబిస్తున్న సామ్రాజ్యవాద, వినాశనకర విధానాలకు బీజేపీ మోడీ ప్రభుత్వం మద్దతివ్వడం దేశ ప్రజలకు హానికరమని ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ అన్నారు. దుగ్గొండి మండలం గిర్నిబావిలో కొనసాగుతున్న ఎంసీపీఐ(యు) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. "అంతర్జాతీయ–జాతీయ పరిణామాలు, కమ్యూనిస్టుల కర్తవ్యం" అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి ముప్పుగా మారాయని, యుద్ధ వాతావరణాన్ని ప్రేరేపిస్తూ పన్నుల పేరుతో ఇతర దేశాలను బెదిరిస్తున్నారని విమర్శించారు. అలాంటి విధానాలకు మోడీ ప్రభుత్వం వత్తాసు పలకడం అన్యాయమని అన్నారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. మార్క్సిజం–పూలే–అంబేద్కర్ ఆలోచనల ఆధారంగా వర్గ–సామాజిక ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి కుంభం సుకన్య వనం సుధాకర్ గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి మంద రవి రాష్ట్ర కమిటీ సభ్యులు నర్రా ప్రతాప్ కుసుంభ బాబురావు గుండెబోయిన చంద్రయ్య తుడుం అనిల్ కుమార్ కర్ర దానయ్య జబ్బర్ నాయక్ నీల రవీందర్ కర్ర రాజిరెడ్డి కనకం సంధ్య గడ్డం నాగార్జున మాస్ సావిత్రి దుగ్గొండి మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్ వివిధ జిల్లాల నాయకత్వం స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మి

**: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట : కళ్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరప్రదాయినిగా నిలుస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 7 మండలాలకు చెందిన 305 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 5 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యశారద, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు అన్ని ఏర్పాట్లు

**: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



అక్షర దర్బార్, భూపాలపల్లి : మేడారం జాతరకు వెళ్లే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాటారం–మహాముత్తారం, భూపాలపల్లి–గొల్ల బుద్దారం మార్గాల్లోని ఆర్ అండ్ బి రహదారులను పరిశీలించారు. రహదారుల మరమ్మత్తులు, గుంతల పూడ్చివేత, రోడ్డు వెడల్పు, సైన్‌బోర్డుల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కమలాపూర్‌లో జరగనున్న మినీ మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుధ్యం, పార్కింగ్ సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని ఆదేశించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, రవాణా మళ్లింపు ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మినీ మేడారం ఆలయ పూజారుల భవన నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారి రమేష్, తహసీల్దార్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.





## బాలాజీ, గీతాంజలి విద్యాసంస్థల్లో

# ఘనంగా వసంత పంచమి

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట బాలాజీ విద్యాసంస్థలు, మహబూబాబాద్ పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల ఆవరణలోని శ్రీ సరస్వతి దేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ, గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు, పాఠశాల డైరెక్టర్లు శ్రీ కొనకంచి రామకృష్ణ, కిరణ్ కుమార్, దేవేందర్, ప్రిన్సిపాల్ ప్రియాంక, మాయ, మమత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెజరర్ డాక్టర్ వనజ మాట్లాడుతూ.. సరస్వతి దేవి కృపా కటాక్షాలు విద్యార్థులందరిపై ఉండాలని కోరుతూ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, జ్యోతి భవానీ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లు మావే ...సీట్లు కూడా మావే!

- పరకాల మున్సిపాలిటీలో ఎస్సీల వ్యూహాత్మక కదలికలు




అక్షర దర్బార్,పరకాల: పరకాల మున్సిపాలిటీలో రాబోయే ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. పట్టణంలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ జనాభా ఎక్కువగా ఉండటంతో, ఈసారి మున్సిపల్ చైర్మన్ పదవిపై ఎస్సీల దృష్టి కేంద్రీకృతమైంది. ఎస్సీ రిజర్వేషన్ జనరల్ కేటగిరీకి వర్తించడంతో పాటు, ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లోని జనరల్ వార్డులలో కూడా ఎస్సీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. దీంతో "ఓట్లు మావే... సీట్లు మావే" అనే నినాదంతో ఎస్సీ వర్గాలు ఒక్కటవుతూ చైర్మన్ పదవిని తమ వశం చేసుకునే దిశగా వ్యూహాలు రచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పరకాల మున్సిపాలిటీలో జనరల్ స్థానాలుగా గుర్తించిన 1, 2, 10, 13, 18వ వార్డులలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటం, అలాగే రిజర్వేషన్ వార్డులను కలుపుకుని చూస్తే ఎస్సీలు ఎక్కువ సీట్లు గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చైర్మన్ ఎంపికలో కీలక పాత్ర ఎస్సీలదే అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, చైర్మన్ పదవిని ఎస్సీకే దక్కేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే వ్యూహం అమలైతే, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై ఎస్సీల రాజకీయ బలం స్పష్టంగా ప్రతిఫలించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.



# 'కాకతీయ'లో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, 1943లో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి వేలాది మంది యువకులను సైనికులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆంగ్లేయులపై సాయుధ పోరాటానికి నేతాజీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. దేశ స్వాతంత్ర్యానికి అంకితమైన ఆయన జీవితం అందరికీ స్ఫూర్తి అని కొనియాడారు.



# శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో సామూహిక అక్షరాభ్యాసం

అక్షర దర్బార్,పరకాల: వసంత పంచమిని పురస్కరించుకుని పరకాల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాఘమాసం శుద్ధ పంచమి, సరస్వతీ మాతా జన్మదినం సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరిపారు. కార్యక్రమానికి పాఠశాల సమితి అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు సాధు సర్వశం, కోశాధికారి, కార్యదర్శి చందుపట్ల చంద్రమోహన్, పాఠశాల కోశాధికారి యర్రం రామన్న, ప్రధానాచార్యులు పి. చంద్రశేఖర్ హాజరయ్యారు. అలాగే మాతాజీలు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# చేనేత కార్మికుల రుణమాఫీ ఆనందకరం



అక్షర దర్బార్, శాయంపేట: చేనేత రుణమాఫీ పథకం కింద శాయంపేట మండల కేంద్రంలోని చేనేత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.9 లక్షలను చెక్ రూపంలో అందజేయడంతో చేనేత సహకార సంఘంలో పనిచేస్తున్న కార్మికులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, తెలంగాణ రాష్ట్ర కార్మిక మినిమమ్ వేజెస్ బోర్డు సభ్యుడు బాసాని చంద్రప్రకాష్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కార్యక్రమాన్ని స్వాగతించారు. రుణమాఫీ వల్ల కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత వర్గానికి అండగా నిలవడం ఆనందకరమని తెలిపారు. ఈ రుణమాఫీ అమలుకు సహకరించిన చేనేత శాఖ ఏడీ విజయలక్ష్మి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

## –టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి



అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : రాష్ట్ర ప్రభుత్వం కొత్త పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా, ఆశ్రమ ప్రాథమిక పాఠశాల, లక్ష్మీనగరం ఉపాధ్యాయులుగా 39 సంవత్సరాలు నిబద్ధతతో పని చేసిన వీసం బుచ్చయ్య పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని, ఆయన సేవలను అభినందించారు. రాష్ట్రంలో రెండున్నరేళ్లుగా పీఆర్సీ అమలు కాకపోవడాన్ని, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు గొప్ప సమరావు, కే రంజిత్ కుమార్, ఎం. వెంకటేష్, వెంకటాపురం మండలం విద్యాధికారి జివివి సత్యనారాయణ, ములుగు జిల్లా అధ్యక్షులు పి. సమ్మయ్య, ఉపాధ్యక్షులు జె. వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసుదేవరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు సృజన్ ప్రసాద్, జనగామ అధ్యక్షులు చంద్రశేఖర్, ములుగు జిల్లా కోశాధికారి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి చెంచయ్య, వివిధ సంఘాల జిల్లా బాధ్యులు, టీఎస్ యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



అక్షర దర్బార్, భూపాలపల్లి : సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీ, కాశీంపల్లిలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్ కాలనీలో హనుమాన్ దేవాలయ నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు  చేశారు. భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలో ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ్ (పీఎం అజయ్) పథకం ప్రారంభించారు. ఎస్సీ రైతుల వ్యవసాయ భూముల్లో నీటి వనరుల కోసం బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద నియోజకవర్గంలో మొత్తం 19 బోర్‌వెల్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా, మంజూరునగర్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని చేనేత కార్మికులకు రూ.59.50 లక్షల విలువైన రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చేనేత రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని, కార్మికుల జీవనోపాధి భద్రత కోసం ప్రభుత్వం తరచుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రుణమాఫీ కారణంగా కార్మికులకు లభించే ఊరటను ఆయన ప్రత్యేకంగా గుర్తించారు.

# మైసంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతా

## సర్పంచ్ వేముల ఇంద్రదేవ్



అక్షర దర్బార్  : మైసంపల్లి గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని సర్పంచ్ వేముల ఇంద్రదేవ్ అన్నారు. శుక్రవారం మండలంలో మైసంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాటాడుతూ.. సుమారు 8 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## : బీఆర్ఎస్ యువ నాయకులు



అక్షర దర్బార్, శాయంపేట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ విమర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారపల్లి మోహన్, మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికెళ్ల ప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. సంక్షేమ పథకాలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులపై విచారణల పేరుతో మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ధైనంపల్లి కరన్, బాబు, కూతాటి రమేష్, యూత్ జిల్లా నాయకులు పెంబర్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా దుస్తుల పంపిణీ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు శుక్రవారం ఏకరూప క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాత గొట్టం శ్రీదేవి రూ.40 వేల విలువైన దుస్తులను అందజేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గేమ్స్ ప్రైజెస్ కోసం గ్రామ పాలకవర్గం రూ.5వేలు  విరాళంగా అందజేసింది. కార్యకమంలో ఉపసర్పంచ్ గడ్డి రాములు, ఎర్రబెల్లి సుధాకర్, మేకల సతీష్, ఉయ్యాల రఘుపతి, బిక్షపతి, రాము మరియు ఉపాధ్యాయులు గవాస్కర్, ఇక్రమ్, శ్యాంసుందర్,  సదానందం హాసీనా మేడం పాల్గొనాన్నారు.



# జనం నాడి అక్షర దర్బార్

అక్షర దర్బార్,పరకాల: జనం నాడిని పట్టుకుని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న పత్రికగా అక్షర దర్బార్ నిలుస్తోందని బీజేపీ జిల్లా కోశాధికారి ఎర్ర రామన్న, పరకాల ప్రముఖ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్ పేర్కొన్నారు.శుక్రవారం పరకాల పట్టణంలో అక్షర దర్బార్ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిత్యం వార్తలను ప్రచురిస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న అక్షర దర్బార్ పత్రిక యజమాన్యాన్ని వారు అభినందించారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, అక్షర దర్బార్ అదే బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తోందని కొనియాడారు.



# 7 గంటలు.. 40 ప్రశ్నలు

- సుదీర్ఘంగా సాగిన కేటీఆర్ విచారణ
- జూబ్లీహిల్స్ పీఎస్ లో ప్రశ్నించిన సిట్
- అర్థం లేని ప్రశ్నలు అడిగారు: కేటీఆర్
- ప్రతి ప్రశ్నకు నిర్భయంగా సమాధానమిచ్చానని వివరణ



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ శుక్రవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌నుసుమారు 7 గంటల పాటు 40 ప్రశ్నలు అడిగి వాంగ్మూలం నమోదు చేసింది. ఉదయం కేటీఆర్ జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. సిట్ అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ కార్యాలయం వెలుపల భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు మోహరించడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు గంటల తరబడి సాగిన ఈ ప్రక్రియలో అధికారులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బృందం వ్యాపారులను బెదిరించి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలున్నాయి. వ్యాపారి శ్రీధర్ రావు ఫిర్యాదు ప్రకారం.. తనను బెదిరించి రూ.12 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి ఇప్పించారని, అదనంగా ఓ ప్రైవేట్ పంచాయతీలో మరో రూ.3 కోట్లు ఇప్పించారని తెలిపారు. ఇదే తరహాలో మరికొందరు వ్యాపారులు కూడా ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో శ్రీధర్ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యాపారులు, సినీనటులు, రాజకీయ నేతలపై బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశాలపై కేటీఆర్ నుంచి సిట్ వాంగ్మూలం నమోదు చేస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా ఎస్ఐబీ అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయంపై అధికారులు ఆరా తీశారు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఈ దర్యాప్తులో కేటీఆర్ వెల్లడించిన అంశాలు ఇప్పుడు అత్యంత కీలకంగా మారాయి. మరోవైపు విచారణపై కేటీఆర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. సిట్ లేనిపోని, అర్థం లేని ప్రశ్నలు అడిగిందని, ప్రతి ప్రశ్నకు తాను నిర్భయంగా సమాధానం ఇచ్చానని చెప్పుకొచ్చారు. మొత్తానికి సిట్ ప్రశ్నలన్నీ చెత్త ప్రశ్నలని ఆయన వెల్లడించారు.

# సమన్వయంతో సక్సెస్ చేద్దాం

## మేడారం జాతరపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ : మరో కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీస్, ఆర్టీసీ అధికారులతో శుక్రవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా గత జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, కారణాలతో పాటు, పోలీస్, ఆర్టీసీ సంయుక్తంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా మేడారం జాతరలో ఆర్టీసీ చేసిన ఏర్పాట్లపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ భాను పోలీస్ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మేడారం తరలి వస్తున్న భక్తుల రద్దీని గమనిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. హన్మకొండ బాలసముద్రం నుంచి జాతరకు వెళ్లే బస్సులకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నగరంలో ఏదైనా ట్రాఫిక్ అంతరాయం కలిగితే జాతరకు వెళ్లే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల నుండి తరలించేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవసిందిగా సీపీ ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దార కవిత, ఆర్టీసీ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ ఎంలులు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవిచందర్, అర్పిత, ధరంసింగ్, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు సీతా రెడ్డి, వెంకన్న, సుజాత ఇతర పోలీస్, ఆర్టీసీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కొమ్మూరి X పల్లా

- ఇరు ఇరువర్గాల మధ్య ప్రొటోకాల్ రగడ
- జనగామలో మంత్రి సీతక్కకు చేదు అనుభవం
- అధికారిక కార్యక్రమాల్లో వ్యతిరేక నినాదాలు
- కొమ్మూరి, పల్లా వర్గీయుల మధ్య తోపులాట



అక్షరదర్బార్, జనగామ : జనగామ జిల్లాలో శుక్రవారం మంత్రి సీతక్క పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అనేక ప్రభుత్వ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనకు వెళ్లిన ఆమెకు స్థానికంగా చేదు అనుభవం ఎదురైంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు బాహాబాహీ తలపడే వరకు వెళ్లడం స్థానికంగా కలకలం సృష్టించింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి వర్గీయులు ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. మంత్రి సీతక్క అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించే ప్రతి సందర్భంలోనూ పల్లా వర్గీయులు ఆమెకు వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు పరస్పర వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో ఉద్రిక్తత పెరిగి ఇరువర్గాలు నెట్టుకోవడంతో తోపులాట సంభవించింది. ప్రోటోకాల్ విషయంలోనూ, పనుల క్రెడిట్ విషయంలోనూ వివాదం రాజుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ కార్యకర్తల నినాదాల మధ్య గందరగోళం నెలకొంది. తన పర్యటనలో ఇలాంటి ఘర్షణలు చోటుచేసుకోవడంపై మంత్రి సీతక్క తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా శాంతియుతంగా ఉండాలని సూచించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటన జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

### - వివాదం ఎందుకంటే

జనగామ బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్ శిల్పాలు, వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా అసలు వివాదం మొదలైంది. ఒక విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను కోరగా.. కాంగ్రెస్ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని, ఎమ్మెల్యే అహంకారంతో వ్యవహరిస్తున్నారంటూ ఆయన మండిపడటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. బస్టాండ్ చౌరస్తా జంక్షన్ వద్ద సూర్య నమస్కారాల శిల్పాల ఆవిష్కరణ సమయంలోనూ ఇదే తరహా ఉద్రిక్త పరిస్థితులు పునరావృతమయ్యాయి. నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతుండగానే మంత్రి సీతక్క బతుకమ్మ కుంటలో పునరుద్ధరణ పనులను, ఆర్ అండ్ బీ బంగ్లాను, కొత్తగా నిర్మించిన వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ పర్యటనలో ప్రోటోకాల్ రగడ, ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపించాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించడంతో మంత్రి తన పర్యటనను కొనసాగించారు. పర్యటనలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీఓ గోపిరామ్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# హస్తం వర్సెస్ గులాబీ

- మెజారిటీ వార్డుల్లో గెలుపు కోసం గండ్ర ద్వయం పోరు
- సింగరేణి గడ్డపై విజయమే లక్ష్యంగా నేతల వ్యూహాలు
- వార్డుల్లో గెలుపు గుర్రాలను ఎంపిక చేయటంపై నజర్
- చైర్మన్ పీఠంపై ప్రధాన పార్టీల్లోని బీసీ నేతల గురి
- తెరపైకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పేర్లు
- మూడో చైర్మన్ ఎవరనే ఆశంపై ఆసక్తికర చర్చ
- భూపాలపల్లిలో పొలిటికల్ హీట్

అక్షరదర్బార్, భూపాలపల్లి : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. మున్సిపాలిటీ చైర్మన్ రిజర్వేషన్ ఈసారి బీసీ జనరల్ కు మారడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. గత రెండు విడతలుగా ఎస్సీ మహిళలకు రిజర్వ్ అయిన ఈ పదవిపై ఇప్పుడు ప్రధాన పార్టీల బీసీ నేతలు కన్నేశారు.

### - నువ్వా - నేనా?

జిల్లా కేంద్రమైన ఈ మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులు ఉండగా, 52,786 మంది ఓటర్లు తమ తీర్పును ఇవ్వనున్నారు. ఇక్కడ ఓటర్లలో సింగరేణి కార్మికులు ఉండటంతో పారిశ్రామిక ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (కాంగ్రెస్), మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి (బీఆర్ఎస్) ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

### - కాంగ్రెస్ లో ఆశావహుల సందడి

కాంగ్రెస్ నుంచి చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారిలో దాట్ల శ్రీనివాస్, అప్పం కిషన్, ముంజాల రవీందర్ గౌడ్, బుర్ర కొమురయ్య, చెరుకుతోట శ్రీరాములు వంటి బలమైన నేతలు ఉన్నారు. అయితే చైర్మన్ అభ్యర్థిని ముందే ప్రకటించకుండా, గెలిచిన కౌన్సిలర్లలో ఒకరిని ఎంపిక చేయాలని అధిష్టానం భావిస్తోంది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల వేగవంతం చేస్తూ జనంలోకి వెళ్తున్నారు.

### - పట్టుకోసం బీఆర్ఎస్ ప్రయత్నం

బీఆర్ఎస్ నుంచి మేకల సంపత్, జక్కం రవికుమార్, నూనె రాజు వంటి నేతలు రేసులో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో పార్టీ శ్రేణులు ఇప్పటికే వార్డుల వారీగా ప్రచార వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. మరోవైపు కొన్ని వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉండటంతో త్రిముఖ పోరు అనివార్యంగా కనిపిస్తోంది.

### - కౌన్సిలర్ గెలిస్తేనే.. చైర్మన్ ఛాన్స్

చైర్మన్ పదవి దక్కాలంటే ముందుగా కౌన్సిలర్ గా గెలవాలి. అందుకే ఆశావహులంతా తమకు అనుకూలమైన వార్డులను ఎంచుకుని, అక్కడ గెలుపు కోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు. మరి ఈ మున్సిపల్ సమరంలో పైచేయి ఎవరిదో చూడాలి.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915